# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 140 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 29 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ బాబులకు

# రాఖీ కట్టిన మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి





**హైదరాబాద్, ఆగస్టు 28(ప్రభాత ఉదయం)**

రాఖీ పౌర్ణమి వేడుకలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి వద్ద మహిళ నాయకురాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి స్వగృహంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఏ సదాలక్ష్మి, మహిళ నాయకురాలు ఆయనకు రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మహిళా నాయకురాళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రత్యేక గా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం సదాలక్ష్మి మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ బాబు స్వగృహాలకు వెళ్లి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు.





# అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించండి



**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహంచారు. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి?, ఇతర రాష్ట్రాల వాదనలేంటి?, తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ



**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై

## కులం, మతం, పార్టీ చూడకుండా

# అర్హులందరికీ ఇళ్లు

### లక్కీ డ్రాతోనే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

- మరో 10 రోజుల్లో రెండో విడత : పొంగులేటి
- అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తున్నామన్న మంత్రి పొంగులేటి
- మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడి
- నాంపల్లి, రాజేంద్రనగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో నేడు లబ్ధిదారుల ఎంపిక




**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ప్రభుత్వం తరపున ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తూ, అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయిస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆయన మాట్లాడారు. నాంపల్లి, రాజేంద్రనగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కులం, మతం, పార్టీ చూడకుండా ..మిగతా 2లో

## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ

# ఛార్జీల బాదుడు

- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం
- రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు
- 1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి
- సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం



**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది. రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ..మిగతా 2లో

# విదేశీ చదువులకు తెలంగాణ సర్కార్ సాయం!

- బీసీ, ఈబీసీ విద్యార్థులకు గుడ్‌న్యూస్
- ఓవర్సీస్ విద్యానిధి కింద 350 మందికి అవకాశం
- బీసీ విద్యార్థులు 250 మంది, ఈబీసీలు 100 మంది
- సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుల స్వీకరణ
- డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి



**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 'మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి' పథకం కింద ..మిగతా 2లో

## జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు

# భారత్ మొగ్గు



- జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న భారత్
- ఆటోమేటెడ్ గైడెన్స్ మెకానిజంతో పని చేసే జావెలిన్ క్షిపణులు
- భారత సైనిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న అత్యాధునిక క్షిపణులు

2



# వరదలపై జైశంకర్ సమీక్ష

- సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యత
- నెల జీతం విరాళంగా ఇచ్చిన నేపాల్ మంత్రులు
- నేపాల్‌లో వరద సహాయక చర్యలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్ష
- నేపాల్ వరదల బాధితులను ఆదుకునేందుకు ప్రధాని, మంత్రుల కీలక నిర్ణయం

2





# వరదలపై జైశంకర్ సమీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)

వరదలతో అతలాకుతలమైన పొరుగుదేశం నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత పరిస్థితులపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సమీక్షించారు. నేపాల్‌లో సహాయక చర్యలకు భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు నేపాల్ మంత్రులు తమ నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. కాఠ్‌మాండూ, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాలతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నట్లు జైశంకర్ తెలిపారు. నేపాల్‌లో ఉన్న భారతీయుల క్షేమం, ప్రస్తుత పరిస్థితిపై తాజా సమాచారం సేకరించినట్లు పేర్కొన్నారు. నేపాల్‌కు మరింత సహాయ సామగ్రి పంపే అంశంపైనా విదేశాంగ శాఖలోని సంబంధిత విభాగాలతో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ఇప్పటికే భారత్ సహాయ చర్యల్లో భాగస్వామ్యం కాగా, అవసరమైన మరిన్ని వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా, ఆయన మంత్రివర్గ సహచరులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ఒక నెల జీతాన్ని ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. రసువా జిల్లాలోని భోటే కోశీ ప్రాంతంలో వరదల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలు, పునరావాసం, పునర్నిర్మాణంపై సమావేశంలో చర్చించారు. వరదలతో నష్టపోయిన వ్యక్తులు, వ్యాపార సంస్థలకు ప్రత్యేక సహాయ, పునరావాస ప్యాకేజీ సిద్ధం చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు.



**భారత్ నుంచి 25 వేల టన్నుల డీఏపీ**

వ్యవసాయ రంగానికి ఇబ్బందులు తలెత్తకుండా నేపాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులను ప్రభుత్వాల మధ్య ఒప్పందం (+2+) విధానంలో కొనుగోలు చేసేందుకు కృషి సామగ్రి కంపెనీ లిమిటెడ్‌కు సూత్రప్రాయ అనుమతి ఇచ్చింది. వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినడం, పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడటంతో ఎరువుల సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

**జిన్‌పింగ్ అధ్యక్షతన అత్యవసర సమీక్ష**

నేపాల్–టిబెట్ సరిహద్దు వరదలపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, సహాయక, గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విపత్తులో మృతిచెందిన వారికి సంతాపంగా సమావేశంలో జీ జిన్‌పింగ్, ఇతర నేతలు కొద్దిసేపు మౌనం పాటించారు. గల్లంతైన చైనా, విదేశీ పౌరులందరినీ గుర్తించి రక్షించేందుకు శాస్త్రీయంగా గాలింపు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

**భారత్-నేపాల్ వాణిజ్యానికి వరద దెబ్బ**

వరదల ప్రభావం భారత్–నేపాల్ సరిహద్దు వాణిజ్యంపైనా పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సోనౌలి సరిహద్దు వద్ద నేపాల్‌లోకి వెళ్లాల్సిన సరకు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. భారత వైపు సుమారు 16 కిలోమీటర్ల మేర ట్రక్కుల క్యూ ఏర్పడింది. కాఠ్‌మాండూ సహా నేపాల్‌లోని వివిధ ప్రాంతాలకు సరుకులు తీసుకెళ్లే వాహనాలు రహదారులు దెబ్బతినడంతో ముందుకు కదలలేకపోతున్నాయి. రాకపోకలు ఆలస్యమైతే ఇరు దేశాల మధ్య సరకు సరఫరాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. సోనౌలి వద్ద పర్యవేక్షణ పెంచి వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు.

**నేపాల్‌కు మళ్లీ వరద ముప్పు**

ఇదిలా ఉండగా, నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో బారియర్ లేక్ కట్ట బద్దలైంది. వరద శిథిలాలతో ఏర్పడిన ఆ భారీ సరస్సు కట్ట శుక్రవారం బద్దలైంది. టిబెట్ వైపున గిరోంగ్ పోర్టుకు కేవలం 10కిలోమీటర్ల దూరంలో శిథిలాలతో ఏర్పడ్డ సరస్సు కట్ట తెగిపోయిందని నేపాల్ పోలీసులు అత్యవసర అలర్ట్ జారీ చేశారు. భోటే కోశీ, త్రిశూలీ నదీ పరివాహక స్థానికులు, భద్రతా బలగాలు, రెస్క్యూ సిబ్బంది వెంటనే సురక్షిత జోన్లకు వెళ్లిపోవాలని హెచ్చరించారు. విపత్తు సంభవించిన ప్రాంతంలో బురద, నీటి మట్టం అమాంతం పెరుగుతోందని, మరో భారీ వరద ముంచెత్తే ముప్పు ఉందని నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. అటు టిబెట్‌లో చైనా సైతం తన సహాయక చర్యలను పూర్తిగా నిలిపేసింది.

## తండ్రి గుర్తింపు కోసం అర్చకుడి ఇంటి వద్ద తల్లి, కొడుకు నిరసన

డీఎన్ఏ పరీక్ష చేయించాలని యువకుడి డిమాండ్

డీఎన్ఏ పరీక్షకు సిద్ధమని ప్రధాన అర్చకుడి ప్రకటన

పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన వివాదం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు28(ప్రభాత ఉదయం)



తనకు తండ్రిగా చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వాలని, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓ యువకుడు తన తల్లితో కలిసి గద్వాల పట్టణంలోని ఓ ప్రధాన అర్చకుడి ఇంటి ముందు శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. బాధితురాలి కథనం ప్రకారం, గద్వాల పట్టణానికి చెందిన ఒక మహిళ సుమారు 24 సంవత్సరాల క్రితం సదరు ప్రధాన అర్చకుడి ఇంట్లో పని చేసేదని తెలిపారు. ఆ సమయంలో తనపై అకృత్యానికి పాల్పడి మోసం చేశారని, ఆ క్రమంలో తాను గర్భవతి అయ్యానని ఆరోపించారు. ప్రాణభయం, సమాజం పట్ల భయంతో ఇన్నాళ్లూ ఈ విషయాన్ని బయటకు చెప్పకుండా తన కుమారుడిని ఎంతో కష్టపడి డిగ్రీ వరకు చదివించినట్లు ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు మాట్లాడుతూ, స్థానికంగా జరిగిన ఓ వివాదంలో తండ్రి పేరు విషయంలో ఎదురైన మాటలతో తనకు అసలు విషయం తెలిసిందన్నారు. తన తండ్రిగా ఆరోపిస్తున్న వ్యక్తిని న్యాయం చేయాలని అడిగితే చంపుతానని, చేతబడి చేయిస్తానని బెదిరించారని ఆరోపించారు. పెద్దమనుషుల సమక్షంలో జరిగిన పంచాయతీలో తనను కొడుకుగా అంగీకరించి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని చెప్పారని, అయితే గత 25--30 రోజులుగా ఫోన్ కాల్స్ ఎత్తకుండా, నంబర్లు బ్లాక్ చేస్తూ తప్పించుకుంటున్నారని యువకుడు ఆరోపించారు. తనకు నిజం తెలియాలని, తండ్రి గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు కష్టపడి పెంచిన తన తల్లికి, తనకు చట్టబద్ధమైన న్యాయం దక్కే వరకు న్యాయపోరాటాన్ని ఆపేది లేదని యువకుడు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న గద్వాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు విషయం పోలీస్ స్టేషన్‌కు చేరింది. తమ ఇంటి ముందు నిరసన చేపట్టి న్యూసెన్స్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాన అర్చకుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తనపై వచ్చిన ఆరోపణలను ప్రధాన అర్చకుడు ఖండించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, నిజానిజాలు తేల్చేందుకు డీఎన్ఏ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు

## జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు

జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను

కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న భారత్

ఆటోమేటెడ్ గైడెన్స్ మెకానిజంతో పని చేసే జావెలిన్ క్షిపణులు

భారత సైనిక రంగానికి భారీ ఊతం

ఇవ్వనున్న అత్యాధునిక క్షిపణులు

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)

సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి అత్యాధునిక 'ఫైర్ అండ్ ఫర్గెట్' సాంకేతికత కలిగిన 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. భారత సాయుధ దళాల ఆధునికీకరణలో భాగంగా ఈ ప్రతిపాదిత రక్షణ ఒప్పందం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. భుజంపై నుంచి ప్రయోగించే ఈ జావెలిన్ క్షిపణి వ్యవస్థ ఆటోమేటిక్ గైడెన్స్ మెకానిజంతో పనిచేస్తుంది. దీనివల్ల క్షిపణిని ప్రయోగించిన తర్వాత అది టార్గెట్‌ను స్వయంగా గుర్తించి దెబ్బతీస్తుంది. అదే సమయంలో, క్షిపణి ప్రయోగించిన సైనికుడు శత్రువుల దాడి నుంచి తప్పించుకోవడానికి లేదా సురక్షిత ప్రాంతంలో తలదాచుకోవడానికి తగిన సమయం లభిస్తుంది. ఎత్తైన పర్వత ప్రాంతాలు, సరిహద్దు వద్ద శత్రుదేశాల ట్యాంకులు, సాయుధ వాహనాలను సమర్థవంతంగా అడ్డుకోవడానికి ఈ జావెలిన్ క్షిపణులు అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయి. భారత సరిహద్దుల్లో రక్షణను మరింత కట్టుదిట్టం చేసేందుకు అమెరికాతో జరుగుతున్న ఈ రక్షణ ఒప్పందం భారత్ సైనిక రంగానికి సాంకేతికంగా పెద్ద ఊతాన్ని ఇవ్వనుంది.

## విదేశీ చదువులకు తెలంగాణ సర్కార్ సాయం!

మొదటి పేజీ తరువాయి...

దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ విడతలో 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనుంది. మొత్తం 350 మందిలో 250 మంది బీసీ విద్యార్థులు ఉంటారు. మరో 100 మంది ఈబీసీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. విదేశీ విశ్వవిద్యాలయాల్లో నాణ్యమైన ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద, మధ్యతరగతి బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అర్హత ఉన్న విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి...



చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.



## కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి...

అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామన్న ఆయన, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామని మంత్రి తెలిపారు.

మరో రెండు, మూడు రోజుల్లో నిర్మాణం ప్రారంభం : ఇళ్ల నిర్మాణం కోసం ఇప్పటివరకు హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తి చేసినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణం ప్రారంభిస్తారని, వాటిని ఏడాదిలోపే పూర్తి చేసి ఆడబిడ్డల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని ప్రకటించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. 10 సంవత్సరాల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు వస్తుందని చెప్పారు. ఇల్లు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తాకట్టు పెట్టుకునేందుకు సైతం అనుమతి ఉంటుందని చెప్పారు. పారదర్శకంగా లక్కీ డ్రాతోనే ఇళ్లను కేటాయిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

4 నియోజకవర్గాల్లో ఎంపిక : క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా మొదటి విడతలో 7,380 ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఇల్లు నిర్మించి ఇస్తున్నామని అన్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇల్లు విలువ రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు ఉంటుందని చెప్పారు. నాంపల్లి, రాజేంద్రనగర్, కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

4 రోజుల పాటు లక్కీ డ్రా : మొదటి దఫాలో 7,340 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అర్హులకు అందించనుంది. ఆయా నియోజకవర్గాల్లో 4 రోజుల పాటు లక్కీ డ్రా నిర్వహణ ఉండనుంది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయి. 19 వేల ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఇల్లు దక్కని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు.

"క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకామనీ) ప్రాంతంలో లక్ష ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి నియోజకవర్గంలో మొదటి విడతలో భాగంగా సుమారు 500ల చొప్పున ఇళ్లు వస్తున్నాయి. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు కూడా ఫైనల్ చేశాం. ఎవరైతే లాటరీలో ఈరోజు ఇళ్లు పొందుతున్న ఆడబిడ్డలున్నారో వారికి సంవత్సరంలోపే ఇంటిని అద్భుతంగా కట్టి ఆ ఇళ్లను ఆ ఆడబిడ్డ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తాం. రిజిస్ట్రేషన్‌కు కూడా ఎలాంటి ఛార్జీలు ఉండవు. పదేళ్ల తర్వాత వారు ఆ ఇంటిని అమ్ముకునేందుకు వెసులుబాటు ఉంటుంది. మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా స్థలాలను గుర్తించాం. టెండర్ల ప్రక్రియ చేపట్టబోతున్నాం. అక్కడ కూడా వారికి ఇళ్లను నిర్మించి ఇస్తాం" -పొంగులేటి శ్రీనివాస రెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రి

లాటరీ తీసిన బాలుడి కుటుంబానికే ఇల్లు : ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి ఓ బాలుడితో మంత్రి పొంగులేటి టోకెన్ తీయించారు. అయితే అందులో ఆ బాలుడి తల్లి పేరే (జరపుల లక్ష్మీ) వచ్చింది. ఈ సన్నివేశం అందరినీ ఆనందానికి గురిచేసింది. ఇలాంటి సందర్భాలు చాల అరుదుగా జరుగుతుంటాయి. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానమని, స్వచ్ఛమైన మనసున్నవారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్వీట్ చేశారు. దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బ్రతకాలని ఆ ఆడబిడ్డను మనసారా ఆశీర్వదించానంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

మొదటి పేజీ తరువాయి...

ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్‌వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి, మంత్రులకు రాఖీ కట్టిన మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి


అన్నయ్యకు రాఖి కడుతున్న చిన్నారి


సోదరులకు రాఖి కడుతున్న సోదరీమణులు


ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కి రాఖి కడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి


వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు రాఖి కడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి

## రాజేంద్రనగర్‌లో కన్నుల పండువగా రక్షా బంధన్

**బుద్వేల్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని శ్రీరామరక్షగా దేవుడే ఇచ్చాడని మహిళా కమిషన్ సభ్యురాలు కుమారి అధ్యక్ష సదాలక్ష్మీ అన్నాడు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సదాలక్ష్మి శుక్రవారం ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ లకు రాఖీలు కట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మహిళలకు అన్నలు గా, రాష్ట్రానికి సంరక్షకులుగా ముఖ్యమంత్రి, మంత్రి మంత్రివర్గ బృందం పనిచేస్తుందన్నారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్: రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రక్షాబంధన్ పురస్కరించుకొని బ్రహ్మకుమారిలు శుక్రవారం ఆయనకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. బీజేపీ నాయకులు వై శ్రీధర్ కు రాఖీ కట్టిన కుటుంబ సభ్యులు బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై శ్రీధర్, ఆయన సోదరులు వై హరి గోపాల్ లకు కుటుంబ సభ్యులు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.


బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకులు వై శ్రీధర్, అతని సోదరునికి రాఖీ లు కడుతున్న కుటుంబ సభ్యులు


రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు రాఖి కడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశీ సదాలక్ష్మి


సీపీఐ రంగారెడ్డి జిల్లా నాయకులు జె ఆనంద్ గౌడ్ కు రాఖి కడుతున్న మహిళా సమాఖ్య నాయకురాళ్ళు


రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డికి రాఖి కడుతున్న బ్రహ్మ కుమారీలు


టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్‌కు రాఖి కడుతున్న మహిళలు



# శంషాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి గాయత్రీ ధారణ వేడుకలు

**శంషాబాద్, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

పవిత్రమైన రక్షాబంధన, గాయత్రీ ధారణ కార్యక్రమాన్ని శంషాబాద్ లోని పద్మశాలి సంఘం లో ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ పద్మశాలి మార్కండేయ సేవా సమితి అధ్యక్షుడు పులిపాటి పాండు ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధనం . గాయత్రి మాల ధారణ, యజ్ఞోపవీతం, ( జంధ్యం ) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి పణి ఆధ్వర్యంలో గణపతి పూజ. మార్కండేయ వ్రతాన్ని నిర్వహించారు . అనంతరం మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులందరూ ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకొని నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్షణ అంటూ ప్రమాణం చేశారు. అనంతరం యజ్ఞోపవీతాలను మార్చుకున్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిపాటి పాండు, సంఘం నాయకులు వర్కల శ్రీరాములు,, బొడ్డు మనోహర్, కాశి గారి ఆంజనేయులు, వర్కల బాలరాజ్, పులిపాటి రవి, పులిపాటి ప్రవీణ్, పాపని వెంకటేష్, బొడ్డు విశాల్ కుమార్, మాస్టర్ బొడ్డు శివాంష్, కాడిగే కృష్ణ, నారని రాజు, రవి, మేకల సుధాకర్, వెంకటేష్, నాగేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు,




# బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రాఖీ పండుగ వేడుకలు

### బ్యాంకు అధికారి రాయప్పకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు

**మెహదీపట్నం, ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖైరతాబాద్ శాఖలో రక్షాబంధన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శుక్రవారం ఖైరతాబాద్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ లో బ్రహ్మకుమారిస్ (హిమాయత్ నగర్) ఉష, ఇందుప్రియలు బ్యాంక్ అధికారులకు రాఖి కట్టి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఉష, ఇందుప్రియలకు బ్యాంక్ అధికారులు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



# తమ్మునికి రాఖీ కట్టిన అక్కలు అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలు

### మార్కండేయ నగర్‌లో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు

**రాజేంద్రనగర్, ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని అక్కలు తమ చిన్ని తమ్మునికి రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. తమ్ముని నుదుట తిలకం దిద్ది, రాఖీ కట్టి వారి సుఖసంతోషాలను ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్కలు తమ్మునిపై ప్రేమ అనురాగాలతో రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు సోదర సోదరీమణుల మధ్య ప్రేమ ఆప్యాయత అనుబంధానికి పత్రికగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆనందోత్సవాలతో వేడుకల్లో పాల్గొన్నారు. అక్కాచెల్లెళ్ల ప్రేమకు, అన్నదమ్ముల ఆప్యాయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతాయని తెలిపారు. "రాఖీ దారం చిన్నదైనా.. అందులో దాగి ఉన్న ప్రేమానుబంధం ఎంతో గొప్పది" అంటూ వేడుకల్లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు....


# అక్రమ మోటార్లపై జలమండలి విజిలెన్స్ కొరడా

### బాపునగర్‌లో 14 మోటార్లు స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 28(ప్రభాత ఉదయం)**

జలమండలి నీటి సరఫరా పైపులైన్ లకు అక్రమంగా మోటార్లు అమర్చి నీటిని తోడుతున్న వారిపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఖైరతాబాద్ జోన్ పరిధిలోని డివిజన్--16, ఎస్.ఆర్. నగర్ వార్డు బాపునగర్ ప్రాంతంలో జలమండలి విజిలెన్స్ బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 14 అక్రమ మోటార్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నీటి సరఫరా సమయంలో పైపులైన్లకు మోటార్లు అమర్చి నీటిని తోడటం వల్ల ఇతర వినియోగదారులకు తగినంత నీరు అందకపోవడంతో పాటు సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని జలమండలి తెలిపింది. అక్రమంగా మోటార్లు వినియోగించే వారిపై తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.




తన సోదరితో రాఖి కట్టించుకుంటున్న జయప్రకాష్


జయప్రకాష్ (ఫైల్ ఫోటో)

## మైలార్‌దేవుపల్లి డివిజన్ ప్రజలకు

# రక్షా బంధన్ శుభాకాంక్షలు

### సంకూరి జయప్రకాష్ నేత.

### త్వరలో పూర్తి స్థాయిలో మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించండి.

**మైలార్ దేవుపల్లి :ఆగస్టు 28 ( ప్రభాత ఉదయం )**

రాఖీ పౌర్ణమి, రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా ప్రముఖ సంఘసేవకులు, వ్యాపారవేత్త, ఇందిరా గాంధీ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సంకూరి జయప్రకాష్ నేత డివిజన్ ప్రజలకు, ప్రధానంగా అక్కా చెల్లెళ్లకు రాఖి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అక్కా తమ్ముళ్ల, అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక ఈ రక్షా బంధన్ పండుగ అని అన్నారు.మన జీవన విధానంలో సంస్కృతి సంప్రదాయం ఉట్టిపడేలా ప్రతి యేడు జరుపుకునే కాఖీ పార్వదినానికి ప్రత్యేక స్థానముందని అన్నారు. సహోదరుల మధ్య ప్రేమ, ఆప్యాయత ఒకరికి ఒకరు రక్షణ గా ఈ రాఖి పర్వదినం ప్రతీకగా నిలుస్తుందన్నారు.

**త్వరలో మీ ముందుకు వస్తున్నా..... ఆశీర్వదించండి.**

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అశీస్సులతో మైలార్ దేవుపల్లి డివిజన్ అభివృద్ధి, సంక్షేమం కోసం పూర్తి స్థాయిలో డివిజన్ ప్రజల ముందుకు వస్తున్నా డివిజన్ ప్రజలు ఆశీర్వాదించాలని జయప్రకాష్ కోరారు. డివిజన్ లో ప్రధానంగా రెక్కడితే గాని డొక్కాడని ప్రజలు అధికంగా వున్నారని, వారి సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంలో స్థానిక నాయకత్వం విఫలమైంది అని, ఇక్కడి ప్రజల సమస్యలు ఎమ్మెల్యే దాకా వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదానంగా చేనేత కార్మికులు ( పద్మశాలిలు ) అత్యధికంగా వున్నా రని ఓ పద్మశాలి నేత గా వారి అభివృద్ధి కోసం త్వరలో పూర్తి స్థాయిలో డివిజన్ లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.




# అక్కచెల్లెళ్ల శ్రేయస్సు కోసం అండగా ఉంటాం: తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

రక్షాబంధన్ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అక్కచెల్లెళ్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా అక్కచెల్లెళ్లతో రాఖీ కట్టించుకొని వారి ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు.అక్కచెల్లెళ్లకు ఎల్లప్పుడూ అండగా,తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.వారి సుఖసంతోషాలు,శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ పవిత్రమైన రాఖీ పండుగ ప్రతి అక్కచెల్లెలి జీవితంలో ఆనందం,ఆరోగ్యం,సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉడుతలక్ష్మి,అంజమ్మ,జి.లక్ష్మి,పద్మ,లత, భాగ్యమ్మ,పూజ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ సోదరి సాయమ్మ జ్ఞాపకార్థం వెండి రాఖీ కట్టిన కుమార్తె

**రాజేంద్రనగర్,ఆగస్టు28(ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ పరిధిలో రక్షాబంధన్ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేక రాఖీ వేడుక చోటుచేసుకుంది.కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అక్క సాయమ్మ నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందారు.అప్పటి నుంచి ప్రతి సంవత్సరం రక్షాబంధన్ పండుగ సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా వేడుక నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో ఈ ఏడాది కూడా వెంకటేష్ కుమార్తె తన మేనత్త సాయమ్మ జ్ఞాపకార్థం ప్రత్యేకంగా వెండితో తయారు చేయించిన రాఖీని తన తండ్రి వెంకటేష్ చేతికి కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపింది.అక్క సాయమ్మ తమ మధ్య లేకపోయినా ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ తమతోనే ఉంటాయని కుటుంబ సభ్యులు తెలిపారు.ప్రతి ఏడాది రాఖీ పండుగ సందర్భంగా సాయమ్మను గుర్తుచేసుకుంటూ ఆమె స్థానంలో తన కుమార్తెతో రాఖీ కట్టించుకోవడం ఆనవాయితీగా వస్తోందని వెంకటేష్ తెలిపారు.చిన్ననాటి నుంచి తమ మధ్య ఉన్న అనుబంధాన్ని,ఆప్యాయతను గుర్తు చేసుకుంటూ రక్షాబంధన్ వేడుకను నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ఉండే ప్రేమ,ఆత్మీయత,అనుబంధానికి ఈ వేడుక నిదర్శనంగా నిలిచింది.సాయమ్మ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా రాఖీ కట్టించుకోవడం కుటుంబ సభ్యులను భావోద్వేగానికి గురిచేసింది.రక్షాబంధన్ పండుగ కేవలం రాఖీ కట్టుకునే వేడుక మాత్రమే కాకుండా కుటుంబ బంధాలను,ప్రేమానురాగాలను గుర్తుచేసే పవిత్రమైన సంప్రదాయమని వెంకటేష్ పేర్కొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

## అన్నా చెల్లెళ్ళు... అక్కా తమ్ముళ్ల....

# అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ


### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. రాష్ట్ర ప్రజలందరికి రాఖీ పండుగ శుభాకాంక్షలు. సబితా రెడ్డి తమ్ముడికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి



తమ్ముడికి రాఖీ కడుతున్నా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి.



సబితా రెడ్డి ( ఫైల్ ఫోటో )



**రంగారెడ్డి ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**

ప్రేమకు ప్రతీక, ఆత్మీయతకు చిరునామా, అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల ఆప్యాయత, అనురాగాలకు వేదికగా రక్షా బంధన్ పర్వదినం నిలుస్తుందని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం రాఖి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలందరికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖి పండుగ సందర్భంగా తన సోదరుడు ( తమ్ముడు ) నరసింహ రెడ్డి కి ఆయన నివాసంలో రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ...రాఖీ పండుగ అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం తను ప్రజా సేవలో ఎంత బిజీ వున్నా తన తమ్ముడికి రాఖి కట్టానిదే కాలు బయటికి పెట్టానని, ఈ సంవత్సరం కూడ తన తమ్ముడు నరసింహ రెడ్డికి రాఖి కట్టి శుభాకాంక్షలు చెప్పినట్లు తెలిపారు. రక్షా బంధన్ పర్వదినం కుటుంబం విలువలను, ఆ కుటుంబంలో ప్రేమానురాగాలను బలోపేతం చేస్తాయని సబితా రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబంతో పాటు ప్రధానంగా రంగారెడ్డి జిల్లాలో ప్రతి ఇంట అక్కా చెల్లెళ్ళ జీవితాలల్లో అన్నా తమ్ముళ్ల ప్రేమ అదేవిదంగా ప్రతి అన్నా తమ్ముళ్ల జీవితాళ్ళలో అక్కా చెల్లెళ్ళ ఆప్యాయత ఎల్లప్పుడూ ఉండి సుఖసంతోషాలతో గడపాలని ఆ దేవుని కోరుకున్నట్లు సబితా రెడ్డి తెలిపారు.








# ఉత్సాహంగా రాఖీ వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు పరస్పరం రాఖీలు కట్టుకుని ప్రేమానురాగాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కేటిదొడ్డి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తోబుట్టువుల మధ్య ఆప్యాయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను స్టేషన్ అధికారులు, సిబ్బంది ఒకే కుటుంబ సభ్యుల్లా ఉత్సాహంగా జరుపుకున్నారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ ధానేశ్వరీ ఎస్ఐ పి.శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణుడు, సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ, రాఖీ పండుగ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల మాదిరిగా ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# గద్వాల జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా రక్షా బంధన్ వేడుకలు



సోదరుడికి రాఖి కడుతున్న సోదరి



రాఖి వేడుకల్లో పాల్గొన్న అక్కా తమ్ముళ్లు



గద్వాల ఎమ్మెల్యే బండ్లకు రాఖి కడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డికి రాఖి కడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల సతీమణి బండ్ల జ్యోతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు28( ప్రభాత ఉదయం)**

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలు శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లాలో ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా అనే తేడాలేకుండా మహిళలు, యువతులు, చిన్నారులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. రక్షా బంధన్ సందర్భంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల నివాసాల వద్ద సందడి నెలకొంది.తమ అభిమాననేతలకు రాఖీలు కట్టేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృషజమోహన్ రెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు క్యాంపు కార్యాలయాల వద్ద పండుగ వాతావారణం నెలకొంది. పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు. కార్యకర్తలు వచ్చి వారికి రాఖీలు కట్టారు. అలాగే గద్వాల జిల్లా కేంద్రంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాసం నందు రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు తన సోదరీతో పాటు, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయ లక్ష్మి, మహిళ ప్రజాప్రతినిధులు, సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి తన సోదరులకు, నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, విజయ్ కుమార్, జి.వేణుగోపాల్, పెద్దపల్లి అజయ్, నాయకులకు, కార్యకర్తలకు రాఖీ కట్టి ఆశీర్వాదం పొందారు. అదే విధంగా గద్వాల బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ బాసు హన్మంతు నాయుడు నివాసంలో, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ నివాసంలో పలువురు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కా తమ్ముళ్ల, అన్నాచెల్లెళ్ల అనుబందానికి ప్రతీక ఈ రక్షా బందన్ అన్నారు. ఈ మంచి అనుబంధాన్ని, ఆప్యాయతల పర్వదినం ప్రతి ఒక్కరిలో ఆనందం నింపాలన్నారు. ఈ పండుగను అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకం అన్నారు.

# నంగునూరు మండలంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**సిద్దిపేట,నంగునూరు, ఆగస్టు 28(ప్రభాత ఉదయం)**

నంగునూర్ మండలం లో రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.ఉదయం నుంచే సోదరీమణులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తమ సోదరులకు నుదుట తిలకం దిద్ది, హారతులు ఇచ్చి రాఖీలు కట్టారు. తమ అన్నదమ్ములు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా



ఆకాంక్షిస్తూ మిఠాయిలు తినిపించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు రక్షణగా ఉంటామని మాట ఇస్తూ, వారికి ప్రత్యేక కానుకలు, నగదు అందజేసి తమ ప్రేమను చాటుకున్నారు.పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని మార్కెట్లు, స్వీట్ షాపులు, రాఖీ స్టాళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి సోదరుల వద్దకు వెళ్లే మహిళా ప్రయాణికులతో బస్సులు, రోడ్లన్నీ రద్దీగా మారాయి. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని పండుగ ప్రాముఖ్యతను చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు మండల వ్యాప్తంగా భద్రతా చర్యలు పర్యవేక్షించారు. మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు వివిధ సంఘాల నాయకులు మండల ప్రజలందరికీ రక్షాబంధన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ఉమ్మడి కుటుంబాల ప్రాముఖ్యతను, కుటుంబ బంధాల మధురిమలను గుర్తుచేసిందని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.





## మై భారత్ రంగారెడ్డి ఆధ్వర్యంలో అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్

### ఎల్‌బీ నగర్‌లో "ఖేలో ఇండియా డైలాగ్ ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28(ప్రభాత ఉదయం)**

జాతీయ క్రీడా దినోత్సవం--2026 సందర్భంగా మై భారత్, యువజన వ్యవహారాలు , క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో "ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రిన్సిపాల్ డా. నీతూ సచ్‌దేవా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మై భారత్ అధికారి యాదగిరి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారిణి కుమారి శ్రావ్య శివాని చిలకలపూడి విద్యార్థులతో ముచ్చటించి, క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. సుధాకర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.విద్యార్థులు, అధ్యాపకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, దేశంలో బలమైన క్రీడా వ్యవస్థను నిర్మించడం, యువత తమ జీవితంలో క్రీడలు , ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలను ప్రధానమంత్రి సందేశం ప్రధానంగా ఉద్ఘాటించింది.క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, మానసిక స్థైర్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందిస్తాయని కార్యక్రమంలో వివరించారు. యువత శక్తిని సానుకూల దిశలో మళ్లించి వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనలో భాగస్వాములను చేయడంలో క్రీడల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు.యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, స్వచ్ఛంద సేవ, అనుభవాధారిత అభ్యాసం, నాయకత్వం మరియు సామాజిక సేవకు సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో ఉత్సాహంగా పాల్గొని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తమ ఆలోచనలు, అభిప్రాయాలతో సహకరించాలని కోరారు.మై భారత్, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ ద్న్యానేశ్వర్ బసుట్కర్ యువత క్రీడలు, ఫిట్‌నెస్‌ను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, మై భారత్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనకు అర్థవంతమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.






## నేడు శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో అన్న ప్రసాదం వితరణ

### దేవాలయం కమిటీ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి.

**భువనగిరి : ఆగస్టు 28(ప్రభాత ఉదయం )**

భువనగిరి మండలం సమాత్ పల్లి గ్రామంలో గల శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మి నరసింహ స్వామీ ఆలయంలో నేడు (శనివారం) ఉదయం 10 గంటల నుంచి అన్న ప్రసాదం వితరణ చేపట్టానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి తెలిపారు. శ్రావణమాసం మూడవ శనివారం పురస్కరించుకొని స్థానికంగా వున్న నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన బొక్క సూర్యకళ, బొక్క రంగారెడ్డి దంపతులు ఈ అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ రావి సురేందర్ రెడ్డి కోరారు.

పూర్ణగిరి లక్ష్మీ నరసింహస్వామి గోవిందా గోవింద

## మానవ సంబంధాల్లో గొప్పదైన బంధం సహోదరత్వం

### మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్

**హైదరాబాద్ : ఆగస్టు 28, ( ప్రభాత ఉదయం )**



మానవ సంబంధాల్లో ఎంతో గొప్పదైన బంధం సహోదరత్వం అని బి ఆర్ ఎస్ అధినేత రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రజలందరికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. అక్కా- తమ్ముళ్లు, అన్నా-చెల్లెళ్ల మధ్య ఉండే అనుబంధం అజరామరమైనదని పేర్కొన్నారు. భారతీయ జీవన విధానంలో రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ఈ వేడుక ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

# శిశుమందిర్ విద్యార్థుల సౌభ్రాతృత్వ సందేశం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**





రక్షాబంధన్ పర్వదిన స్ఫూర్తిని సమాజంలో విస్తరింప జేయడంతో పాటు సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, సామాజిక ఐక్యత మరియు దేశభక్తి భావాలను ప్రజల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీ సరస్వతీ శిశుమందిర్ హై స్కూల్, కరీనగర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కరీంనగర్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, భగత్‌సింగ్ సర్కిల్, కమాన్ సర్కిల్ మరియు విద్యానగర్ ప్రాంతాల్లోని దుకాణాలు, కార్యాలయాలు, వివిధ సంస్థలను సందర్శించి వారికి రాఖీలు కట్టారు. ప్రత్యేకంగా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, సివిల్ పోలీసు సిబ్బంది వద్దకు వెళ్లి విద్యార్థినులు ఆత్మీయంగా రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారు, "మీకు మేము రక్ష...మాకు మీరు రక్ష...మనందరం దేశానికి రక్ష!" అనే సందేశాన్ని అందిస్తూ రక్షాబంధన్ యొక్క విశాలమైన అర్థాన్ని చాటి చెప్పారు. రాఖీ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే బంధానికి మాత్రమే ప్రతీక కాదని, ఒకరినొకరు గౌరవించుకోవడం, అవసరమైనప్పుడు ఒకరికొకరు అండగా నిలవడం, సమాజ భద్రత కోసం కలిసి పనిచేయడం, దేశం పట్ల బాధ్యతను కలిగి ఉండడం వంటి ఉన్నతమైన విలువలకు ప్రతీక అని విద్యార్థులు తెలియజేశారు. విధినిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది విద్యార్థుల కార్యక్రమాన్ని అభినందిస్తూ, చిన్న వయసులోనే విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు సోదరభావం వంటి విలువలను పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టి, సేవాభావం, క్రమశిక్షణ, బాధ్యత మరియు భారతీయ సంస్కారాలను అందించడం శిశుమందిర్ విద్యా విధానంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. రక్షాబంధన్ ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తి మరో వ్యక్తి పట్ల బాధ్యత కలిగి ఉండాలనే భావనను విద్యార్థుల్లో పెంపొందిస్తూ, "మనమంతా ఒక కుటుంబం -- మన దేశం మనందరి బాధ్యత" అనే భావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు రక్షాబంధన్‌ను కుటుంబ బంధం నుంచి సామాజిక బంధంగా విస్తరించే చక్కని సందేశాన్ని అందించింది. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం కరినగర్ జిల్లా ఉపాధ్యక్షులు పాక పావన కృష్ణ, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, సభ్యులు కొత్తూరు ముకుదం, కరీనగర్ విభాగ్ ఉపాధ్యక్షులు కోట లక్ష్మారెడ్డి, ఆచార్య బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల నివసించే చోటే ఇండ్లు నిర్మిస్తున్నాం: మంత్రి పొంగులేటి

**రాజేంద్రనగర్ లో ఇందిరమ్మ టవర్స్ డ్రా తీసిన మంత్రి పొంగులేటి... అణువుగా పేదలకు ఇల్లు నిర్మిస్తున్నాం**

**రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు ప్రభుత్వం నిర్మిస్తోంది**




ఇందిరమ్మ ఇండ్ల డ్రాలో టోకెన్ చూపిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి...




డ్రాలో ఇల్లు దక్కించుకున్న మహిళకు అందజేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..





ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కోసం డ్రా తీస్తున్న హౌసింగ్ సిబ్బంది

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

పేదల నివసించే చోటే ఇండ్లు నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం--పొదుపు సంఘం హాల్‌లో నిర్వహించిన క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ప్రక్రియను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ... ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పేద కుటుంబాలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, తొలి దశ పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ సుమారు రూ.50--60 లక్షలు, నిర్మాణ వ్యయం సుమారు రూ.10--15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. గతంలో పేదలకు ఇళ్లు కేటాయించే సమయంలో వారి నివాస ప్రాంతాలకు 30--40 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి, పిల్లల చదువులు, స్థానిక సామాజిక సంబంధాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని స్పష్టం చేశారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా పరిశీలించి, పత్రాలు, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు కాదని, అర్హులైన వారికి తదుపరి దశల్లో కూడా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్సరంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఇల్లు ఇచ్చే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం, మహిళలకు ఆస్తిపై హక్కును కల్పించే కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో "పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అనే నిబద్ధతతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్ దశల్లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) డాక్టర్ కె.కిరణ్మయి, రాజేందర్ నగర్ ఆర్డీఓ శ్రీధర్, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, సంబంధిత అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మహిళా బాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రక్షాబంధన్ పురస్కరించుకొని రాఖీ కడుతున్న మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సోనియా దర్శన్



మాజీ మంత్రి బి ఆర్ ఎస్ నాయకుడు హరీష్ రావు కు రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని రాఖీ కడుతున్న బి ఆర్ ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న సతీష్



మాజీ మంత్రి టి దేవేందర్ గౌడ్ కు రక్షాబంధన్ సందర్భంగా నవ్వుతూ రాఖీ కడుతున్న శంషాబాద్ కు చెందిన బి.ఆర్.ఎస్ నాయకురాలు దీపా మల్లేష్ ముదిరాజ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డికి మోహినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్ రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు జిల్లా బి ఆర్ ఎస్ మహిళ అధ్యక్షురాలు స్వప్న సతీష్, మాజీ హోం శాఖ మంత్రి టి దేవేందర్ గౌడ్ కు శంషాబాద్ కు చెందిన బి ఆర్ ఎస్ నాయకురాలు దీప మల్లేష్ ఆయన స్వగృహానికి వెళ్లి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



# గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**నార్సింగి, ఆగస్టు 28 (ప్రభాత ఉదయం)**

హిందూ ఐక్యతకు ప్రతీకగా 47వ భాగ్యనగర్ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూచించారు. లోకమాన్య బాల్ గంగాధర్ తిలక్ స్ఫూర్తితో, హిందూ సమాజాన్ని ఏకం చేసే మహోన్నత లక్ష్యంతో రూపుదిద్దుకున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఈ ఏడాది 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది. రాబోయే వినాయక చవితి ఉత్సవాలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక చైతన్యంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ కన్వీనర్ వై. శ్రీధర్, సహ కన్వీనర్ బొక్కా బాల్ రెడ్డి, ప్రతినిధులు నాగేష్, సిద్ధప్ప, రమాకాంత్ రెడ్డి, జయదీప్, గణేష్ , ఇతర సమితి సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ఉత్సవ సమితి ప్రతినిధులు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గారితో మరియు విద్యుత్, మున్సిపాలిటీ, పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చించారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, కట్టుదిట్టమైన భద్రత మరియు మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్రంగా సమీక్షించారు.

**ధర్మ పరిరక్షణే ధ్యేయం -- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్పష్టం:**

సమావేశం అనంతరం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ... "సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ ఐక్యతే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మూలస్తంభాలు. లోకమాన్య తిలక్ చూపిన సమైక్యతా మార్గంలో గత 46 ఏళ్లుగా విజయవంతంగా సాగుతున్న ఈ ఉత్సవాలు, ఇప్పుడు 47వ సంవత్సరంలోకి అడుగుపెడుతూ మరింత ధార్మిక శక్తితో, హిందూ సమాజ చైతన్యంతో జరగబోతున్నాయి. మండపాల ఏర్పాటు నుండి నిమజ్జనం వరకు ప్రతి ఘట్టంలోనూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇతర అధికారులు సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలి. ధర్మ రక్షణ కోసం హిందూ బాంధవులందరూ ఏకమై ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నాం." ప్రభుత్వ యంత్రాంగం, మున్సిపాలిటీ , పోలీసులు గణేష్ ఉత్సవాల సజావు నిర్వహణకు సంపూర్ణ సహకారాన్ని అందించాలని, హిందూ భక్తుల భక్తి భావాలకు తగినట్లుగా ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఉత్సవ సమితి స్పష్టం చేసింది.

# నేడు సబితా ఇంద్రారెడ్డి ఈ కార్యక్రమాలలో పాల్గొంటారు

**రంగారెడ్డి : ఆగస్టు 28 (ప్రభాత ఉదయం )**



రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి నేడు ( శనివారం ) ఈ క్రింది కార్యక్రమాలలో పాల్గొంటారని సబితా రెడ్డి కార్యాలయం శుక్రవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి సబితా రెడ్డి నేడు ( శనివారం ) ఉదయం 10.30 గంటలకు ఎల్ బి నగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం లో గల జి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో జరిగే దివ్యంగుల హక్కుల కోసం నిర్వహించనున్న సమర శంఖరావం క్రార్యక్రమంలో పాల్గొంటారని, తధనంతరం మధ్యాహ్నం 3 గంటలకు చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని చేవెళ్ల మున్సిపాలిటీ లో గల అట్లాస్ ఫంక్షన్ హాల్ జరుగనున్న కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల అసమర్ధత పాలనకు నిరసనగా నిర్వహించనున్న సమర భేరి కారుక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొని కాంగ్రెస్ వైపాళ్యలను ఎందగట్టనున్నరని ఈ నిరసన కార్యమాలలో ఆయా నియోజకవర్గాల ప్రజలు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ పిలిపునిచ్చారు.



# గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

**ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్, ఆగస్టు28(ప్రభాత ఉదయం)**

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608